క్లుప్తంగా

పెద్దమ్మ తల్లీ దీవించు



డోర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సెలవుల్లో విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



ఆటో ద్వారా అవగాహన కల్పిస్తున్న మర్రిపల్లె అబ్దుల్ గఫార్

డోర్నిపాడు: రానున్న దసరా సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సామాజిక ప్రసంగికులు మర్రిపల్లె అబ్దుల్ గఫార్ సూచించారు. ఆటోయాత్రలో భాగంగా ఆయన ఆదివారం మండలకేంద్రం డోర్నిపాడులో ప్రసంగించారు. సెలవుల్లో చిన్నారులు ఈత సరదా అంటూ బావులు, నదులు, కాల్వలల్లోకి వెళ్తారని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాల మీదకు వస్తుందన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న సందర్భాలు మనం నిత్యం చూస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నందున తల్లిదండ్రులు పొలాలకు వెళ్లే సమయంలో చిన్నారులకు జాగ్రత్తలు చెప్పి వెళ్లాలని సూచించారు.

నేడు 'స్పందన'

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిచంనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

పవన్, బాబుల కలయిక రాష్ట్రానికి అరిష్టం

నంద్యాల(అర్బన్): పవన్ కల్యాణ్, చంద్రబాబులు కలిస్తే రాష్ట్రానికి అరిష్టం వస్తుందని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆర్థిక నేరగాడు చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌ల అపవిత్ర కలయికతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తూ స్వప్రయోజనాలకు రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన చంద్రబాబును రాజమండ్రి జైలుకు పంపడంలో తప్పేమి లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే ధ్యేయంగా పరిపాలన చేస్తుంటే ఎల్లో మీడియాలు, దత్తపుత్రుడు రాజకీయ మనుగడల కోసం దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత నాలుగేళ్లలో గిరిజనులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందాయన్నారు.

పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్



ఎన్నికైన నూతన కమిటీతో గౌస్‌బాషా

నంద్యాల(అర్బన్): పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం కర్నూలు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్ బాషా అధ్యక్షతన నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా వెంకటరాముడు, ఉపాధ్యక్షులుగా మహబూబ్‌బాషా, గౌస్‌బాషా, జాయింట్ సెక్రటరీగా బాబుసాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర బాడీ ఆదేశాల మేరకు నూతన కమిటీ ఎన్నికైందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.

కాలుష్యంతో ముప్పు

మహానంది: కాలుష్యం పెరిగితే మానవమనుగడకే ప్రమాదం తప్పదని, ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి తెలిపారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మహానందిలో ఆదివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌ఓ హైమావతి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించుకుంటూ పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ ప్రతాప్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ కొలువు

- రాష్ట్ర ప్రభుత్వ సహకారం
- 75 శాతం ఉత్తీర్ణత సాధించిన అన్ని గ్రూపుల విద్యార్థులు అర్హులే
- నవంబర్‌లో రిజిస్ట్రేషన్



ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ సునిత(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఇంటర్మీడియెట్ పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ కొలువు దక్కనుంది. అలాగే ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కూడా ఉంది. 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల విద్యార్థులకు ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు అందనున్నాయి. జిల్లాల్లో 2022–23లో ఇంటర్ పూర్తి చేసిన వారికి 2024 విద్యాసంవత్సరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులు దీనికి అర్హులు. ఆసక్తి ఉన్న వారు నవంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారికి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియలు చేపడతారు. మొదట క్యాట్ ఎగ్జామ్, రెండోది ఇంగ్లిష్ వర్షన్ పరీక్ష, ఫైనల్‌గా ఇంటర్వ్యూ ఉంటుంది. మూడింటిలో ఉత్తీర్ణత సాధించాక ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు స్టైఫండ్ ఇస్తారు. ఇంటర్ ఎంపీసీ,ఎంఈసీ చదివిన విద్యార్థులు ఐటీ రంగంలో నూ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేటివ్‌కు సంబంధించి డీపీఓ విభాగంలోనూ ఉద్యోగాలు పొందొచ్చు.

ఉద్యోగం చేస్తూ ఉన్నత విద్య..

ఇంటర్‌తో ఉద్యోగంలో చేరిన విద్యార్థుల చదువు అక్కడితో ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఉన్నత యూనివర్సిటీలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. బిట్స్ పిలానీ, శస్త్ర, ఏమిటీ, ఐఐఎం నాగ్పూర్, కేఎల్ యూనివర్సిటీలున్నాయి. వీటిలో ఉన్నత విద్యను అభ్యసించే దిశగా విద్యార్థులు చెల్లించే ఫీజులో కొంత హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లించనుంది.

అవగాహన పెంచుకోవాలి



జిల్లాలో ఇంటర్ చదువుతున్న, పూర్తి చేసిన విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రిన్సిపాళ్లకు సమావేశం నిర్వహిస్తున్నాం. అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు హాజరై ఉద్యోగాల రూపకల్పనపై అవగాహన పెంచుకోవాలి. తద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించవచ్చు. ఇంటర్ బోర్డ్, హెచ్‌సీఎల్ టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం జరుగుతుంది.

– సునిత, డీవైఈఓ, నంద్యాల

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు ఇంటర్‌తో ఉద్యోగం సంపాదించుకునేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీని ద్వారా ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు ఐటీ రంగంలో ఉద్యోగాలు సాధించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై అన్ని యాజమాన్యాల ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అవగాహన పెంచుకునేలా సమావేశం ఏర్పాటు చేశాం.

– రవి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్. కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కింద వున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

ఆత్మకూరు ఆర్‌డీఓపై ఫిర్యాదు చేస్తాం

నంద్యాల(న్యూటౌన్): ఆత్మకూరు ఆర్‌డీఓపై స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అవినీతిని ప్రశ్నించిన సీపీఐ నాయకులను బెదిరించడం తగదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వకుండా ఏ విధంగా నియమిస్తారని ప్రశ్నించినందుకు ఫోన్‌లో సీపీఐ నాయకులను బెదిరించడం దారుణమన్నారు. సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మోటరాముడు, పట్టణకార్యదర్శి ప్రసాద్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): త్రోబాల్, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ తదితర క్రీడాంశాల్లో జరుగుతున్న క్రీడాకారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఖాదరబాద్ నర్సింగరావు స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాల అండర్–14, అండర్–17 ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలను ఆదివారం తిలకించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎంపిక జాబితాను పంపక పోవడం, 55 మంది వ్యాయామ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేయగా 20మంది మాత్రమే హాజరుకావడంపై డీఈఓ అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వ్యాయామ ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆదేశించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం



పద్మశ్రీ మహమ్మద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): వారసత్వ సంపదను కాపాడుకుంటూ ముందు తరాలకు అందజేయాలని ప్రముఖ పురాతత్వ శాఖ విశ్రాంతి అధికారి పద్మశ్రీ మహమ్మద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని భరతమాత గుడి వీధిలోని యోగా కాన్సెప్ట్ ట్రస్ట్ భవన్‌లో భారత వారసత్వ సంపద గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురాతన కట్టడాలను రక్షించుకుని వాటిలో ఉన్న పరిజ్ఞానాన్ని భావితరాలకు అందించాలన్నారు. మన ప్రాంతంలో ఉన్న పురాతన ఆలయాలు, కట్టడాలను గుర్తించి శిథిలావస్థలో ఉన్నవాటిని పునర్నిర్మితం చేసి వాటికి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగారావు, లక్ష్మీనారాయణ, సేతురామన్, శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాలటౌన్: నంద్యాల జిల్లా నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన లాయర్ గోళ్ల జయకృష్ణను రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులుగా ఉన్న సీనియర్ లాయర్ జయకృష్ణ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు, విద్యార్థులకు, ఆలయాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జంబులమ్మగుడి వద్ద నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి రూ.10 వేలు అందించిన క్లబ్ సభ్యుడు మాలపాటి రాజశేఖర్‌ను క్లబ్ సభ్యులు అభినందించారు. క్లబ్ సెక్రెటరీ సుధాకర్‌రెడ్డి, సుబ్బరామయ్య, విజయశేఖర్‌రెడ్డి మధుసూదన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు ప్రారంభం

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను జెడ్పీటీసీ పుల్యాల దివ్య రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖోఖో పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సండే సందడి

మహానంది: మహానందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. కొద్దిరోజులుగా రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ వీకెండ్ శనివారం, సెలవురోజు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం క్షేత్రంలో కూడా భక్తుల సందడి నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి.

బధిర విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ



బధిర విద్యార్థులకు పరికరాలు పంపిణీ చేసిన క్లబ్ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): నవజీవన్ బధిరుల పాఠశాల విద్యార్థులకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను పంపిణీ చేసినట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, నంద్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పీవీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయ లయన్స్ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లబ్ సభ్యులు సుబ్బారావు, గౌరీనాథ్‌ల సౌజన్యంతో బధిర విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. బధిర విద్యార్థులకు ఐఎంఏ హెల్త్ కార్డులు అందజేస్తామన్నారు. చిత్రలేఖనంలో, నృత్యంలో ప్రవీణ్యం కలిగిన వారు ఉన్నారని, అదే విధంగా క్రీడల్లో కూడా బాగా రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫాదర్ మర్రెడ్డి, సిస్టర్ తంగం, సోమేసుల నాగరాజు, మామిళ్ల నాగరాజు, హెచ్ఎం పద్మావతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో నిర్మాణం పూర్తయిన పీహెచ్‌సీ నూతన భవనం

ప్రారంభానికి ముస్తాబు




ముత్తలూరులో ముస్తాబవుతున్న సచివాలయం, ఆర్‌బీకే భవనాలు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు, ముత్తలూరు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన నూతన భవనాలు ప్రారంభానికి ముస్తాబవుతున్నాయి. త్వరలోనే అధికారులు ఆయా భవనాలోల కార్యాలయాల ద్వారా సేవలు అందించనున్నారు. ఆలమూరులో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరి వర్షాకాలం పొటుకెత్తి అక్కడక్కడ పెచ్చులూడి పడేది. సమస్యను గత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన భవన నిర్మానానికి దాదాపు రూ.1.87 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. కాగా, పనులన్నీ పూర్తి కావడంతో ప్రారంభానికి ముస్తాబు పనులు చేస్తున్నారు. అలాగే ముత్తలూరులో దాదాపు రూ.60లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు సంబంధించిన భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ వేగవంతంగా చేయిస్తున్నారు. పనులు చివరి దశలో సాగుతున్నాయి. కొద్ది రోజుల్లోనే పనులన్నీ పూర్తి చేసి భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని కాంట్రాక్టర్ మధు తెలిపారు.

మూకుమ్మడి చర్యలతోనే మూషిక సంహారం

- ఎలకలతో వరిపైర్లకు నష్టం
- దిగిబడిపై ప్రభావం పడే అవకాశం
- జిల్లాకు 395.26 కిలోల బ్రోమోడయోలిన్ మందు మంజూరు
- రైతులకు ఉచితంగా అందజేస్తున్న ప్రభుత్వం



రైతులు సాగు చేసిన వరిపైరు, (ఇన్‌సెట్)వరిపైరును కొరుకుతున్న ఎలుక

గోస్పాడు: రైతులకు ప్రతి ఏడాది ఎలుకల బెడద తప్పడం లేదు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి పైరును పెంచి పెద్ద చేసిన తర్వాత వరి చిరు పొట్ట దశలో ఎలుకలు విజృంభించి పంటకు నష్టం కలగ చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ఎలుకలు పొలాల్లో విజృంభిస్తూ వరి దుబ్బలను మొదలు వరకు కొరికేస్తున్నాయి. రసాయనిక మందులు ఎన్ని వాడిన ఎలుకల నిర్మూలన సాధ్యం కాక రైతులు ముప్పు తిప్పలు పడుతున్నారు. ఎలుకల నిర్మూలనకు అధికంగా ఖర్చు అవ్వడమే కాకుండా దిగుబడిపై కూడా ప్రాభవం చూపుతుందని రైతులు ఆందోళన చెదుతున్నారు.

సామూహిక నివారణ చర్యలతోనే సాధ్యం..

ఎలుకలను పొలాల్లో విడివిడిగా కాకుండా రైతులందరూ కలిసి సామూహికంగా నివారణ చర్యలు చేస్తే తప్ప ఫలితం ఉండదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా రైతులు తమ పొలాల్లో మందులు పెట్టి ఎలుకలను నిర్మూలించినా.. పక్కా పొలాల నుంచి ఎలుకలు వచ్చి తమ సంతతిని వృద్ధి చేసుకుంటూ పంటలపై దాడి చేస్తుంటాయి. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎలుకల నివావరణ మందు బ్రోమోడయోలిన్ పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపడున్నారు.

ఉచితంగా ఎలుకల నివారణ మందు..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 70,5256 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గాను41,526 వేల హెక్టార్లలో వరిని రైతులు సాగు చేశారు. వరి పైర్లు సాగుచేసిన రైతులను ఎలుకల బారి నుంచి విముక్తి కల్పించి ఆదుకునేందుకు ప్రభుత్వం జిల్లాకు 395.26 కేజీల బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేసిందని అధికారులు చెబుతున్నారు. రైతులకు ఉచితంగా మందును అందజేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

ఎలుకల్లో అధిక సంతాన ఉత్పత్తి...

ఎలుకల్లో అధిక సంతానోత్పత్తి సామర్థ్యం ఉండడంతో నివారణ కష్టసాధ్యమవుతుంది. ఎలుకల జీవిత కాలం రెండేళ్ల మాత్రమే, కానీ ఆడ ఎలుక పుట్టిన 35 రోజుల నుంచి సంతాన ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యం కలిగి ఉంటుంది. ఎలుకలు ఏడాదికి సుమారు 800 నుంచి 1200 వరకు పిల్లలు పెడతాయని అధికారులు చెబుతున్నారు.

ఎర తయారీ..వాడే విధానం..

బ్రోమోడయోలిన్ మందును తిన్న ఎలుకల్లో స్లోపాయిజన్‌గా పనిచేసి రక్తనాళాలు దెబ్బ తినడంతో మూడు, నాలుగు రోజుల తర్వాత ఎలుక చనిపోతుందని అధికారులు చెబుతున్నారు. మందు పెట్టిన ఒకటి రెండు రోజుల్లో దాదాపు పొలంలోని ఎలుకలన్నీ దీనిని తింటాయి. హెక్టారు పొలానికి తయారు చేసిన మందు (ఎర) అరకేజీ అవసరం అవుతుంది. 480 గ్రాముల బియ్యపు నూకలు ,10 గ్రాముల నూనె ,10 గ్రాముల బ్రోమో డయోలిన్ మందు కలిపి ఎర తయారు చేసుకోవాలి. ముందుగా నూకలను పేపర్‌పై వేసి నూనె పోసి కలపాలి. ఆపై బ్రోమోడయోలిన్ మందు వేసి నూనె కలిపిన నూకలను పట్టించాలి. ఈ మందును మూడు అంగుళాల వ్యాసము, 18 అంగుళాల పొడవు కలిగిన పీవీసీ పైపుల్లో 30 గ్రాములు చొప్పున వేసి పొలానికి చుట్టూ నాలుగు మూలలా గట్లపై అమర్చుకోవాలి. వారానికి రెండుసార్లు తాజాగా తయారు చేసిన ఎరను ఉంచాలి. పీవీసీ పైపులు వాడడం వలన విషపు ఎర ఎండ, వానలకు పాడవకుండా ఉంటుంది. అంతేకాకుండా పక్షులు, పెంపుడు జంతువులకు అందకుండా మెరుగైన ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

డివిజన్ల వారీగా బ్రోమోడయోలిన్ మందు మంజూరు వివరాలు..

డివిజన్	మంజూరు మందు కిలోల్లో
ఆళ్లగడ్డ	134.67
ఆత్మకూరు	44.81
కోవెలకుంట్ల	26.37
నందికొట్కూరు	7.27
నంద్యాల	182.14

ఎలుకలతో వరి పైరుకు ఇబ్బందిగా ఉంది



ఎలుకలు అధికంగా ఉండడంతో వరి పైర్లకు ఇబ్బందికరంగా మారింది. ఎలుకలు పొలం గెట్ల వెంట ఎక్కడబడితే అక్కడ బొరియలు వేసి పొలాల్లో తిరుగుతూ వరి పిలుకలను కొరికేస్తున్నాయి. దీంతో పైరు ఏపుగా పెరుగుతున్న సమయంలో పైరు నష్టపోవాల్సి వస్తోంది. ఎలుకలను నివారించేందుకు ఎన్నిక రకాల మందులు వాడినా ఫలితం లేకపోగా.. వాటి కోసం మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది.

– సిద్ధయ్య, సాంబవరం, రైతు

బ్రోమోడయోలిన్‌తో సామూహిక ఎలుకల నిర్మూలన



జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలనకు 395.26 కిలోల బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ మందును జిల్లాలోని మండలాల వ్యవసాయ అధికారులకు త్వరలో అందజేస్తాం. రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలనకు మందుపై అవగాహన కల్పించి, పంపిణీ చేస్తాం. రైతులంతా సామూహికంగా నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఆకులనే ఆవాసంగా మార్చి..



సోయాచిక్కుడు చేనులో కలుపు మొక్కకు ఊరపిచ్చుక అల్లిన గూడు



బట్టల అల్లిక లాగా ఉన్న పత్రం వెనుక భాగం

నంద్యాల(సెంట్రల్): ప్రకృతిలో ప్రతి జీవి తన సంతాన రక్షణకు భద్రమైన ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. పక్షులు గుడ్లు పొదిగి, పిల్లగా మారి అవి సొంతంగా ఆహారాన్ని సంపాదించుకునే వరకూ కంటికి రెప్పలా కాపాడుకుంటాయి. కానీ ఇన్నాళ్లూ చెట్లు, పొదల్లో మాత్రమే విరివిగా కనిపించే పక్షి గూళ్లు కలుపు మొక్కల్లో సైతం గోచరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాంటిదే ఈ దృశ్యం.. గడివేముల మండలం బూజునూరు గ్రామంలోని ఓ రైతుకు చెందిన సోయాచిక్కుడు పొలంలోని దువ్వెన బెండ మొక్కకు ఓ ఊర పిచ్చుక ఎంతో నేర్పుగా గూడు అల్లింది. రైతు కలుపు కోయటానికి సమాయత్తమవుతుండగా.. ఈ దృశ్యం కనిపించింది. రెండు ఆకుల్ని కలిపి, సమీపంలో దొరికిన చెత్త, పత్తితో బట్టలా కుట్టి, గూడును ఏర్పటుచేసిన విధానం అబ్బురపరచింది. సదరు రైతు పెద్ద మనసుతో ఆ గూడు ఉన్న మొక్కతో పాటు చుట్టూ కొన్ని కలుపు మొక్కల్ని నీడ కోసం అలాగే ఉంచి, మిగతా పొలం కోసుకుని వెళ్లి పోవడం కొసమెరుపు.

మహానందిలో క్యూలైన్ల ఆధునికీకరణ



ఆధునికీకరించిన క్యూలైన్లు



మహానంది: మహానందీశ్వరుడి భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలను ఆధునికీకరిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులు వెళ్లే క్యూలైన్లు పాతబడిపోవడంతో వాటి స్థానంలో ఆదివారం నూతనంగా స్టెయిన్‌లెస్ స్టీల్ క్యూలైన్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ మేరకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో సుమారు రూ. 7లక్షలు వెచ్చించి ప్రస్తుతం కొన్ని క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. మరికొంత మంది దాతల ఆధ్వర్యంలో ఉచిత, సాధారణ, ప్రత్యేక ఇతర పాత క్యూలైన్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.